# నాగరాజీయమ్

రాయసం వెంకట్రామయ్య

10

## పోలింగ్ ఆఫీసరు

నాగరాజు ఆఫీసు నుండి వచ్చి చొక్కావిప్పి గోడమీది మేకుకి తగిల్చాడు. సావిత్రి లోపల్నించి వచ్చి ''ఎందుకు ఆలశ్య మైంది, ఈరోజు?'' అని అడిగింది.

నాగరాజు ఆ ప్రశ్నకి వెంటనే సమాధాన మివ్వకుండా, పెరట్లోకి వెళ్లి కాళ్లు, ముఖం కడుక్కొని వచ్చాక అన్నాడు ''నన్ను ఎలక్షన్ డ్యూటీకి పడేశారు. ఆ మీటింగ్‌కి వెళ్లి వచ్చేసరికి ఆలస్య మైంది.''

సావిత్రి ముఖంలో ఏదో ఆందోళన స్ఫురించింది. నెమ్మదిగా అంది ''మనకెందుకండీ ఎలక్షన్ డ్యూటీ? అది చాలా ప్రమాదకరమైన పనికదా! మానెయ్యడానికి ప్రయత్నించండి. గత ఎలక్షన్ లో ఎన్నిగొడవలయ్యాయి.''

అప్పుడే నేను నాగరాజు దగ్గర తీసుకున్న చేబదులు తిరిగిద్దామని వాళ్లింటో అడుగు పెట్టాను. సావిత్రి నన్ను చూడగానే ''మంచి టైముకే వచ్చారు అన్నయ్యగారు. చూడండి ఈయన్ని ఎలక్షన్ డూటీకి వేశార్ట. మీరైనా చెప్పి మార్పించండి. నాకు ఎలక్షనంటేనే భయం.'' అంది.

నేను కుర్చీలో కూర్చుంటూ నాగరాజు వంక చూశాను. వాడే అన్నాడు.

''ఏం లేదురా. నాక్కూడా ఎలక్షన్ డ్యూటీ తగిలించారు. ఈ ఏడాదిలో ఇదే మొదలు. వెయ్యక వెయ్యక పాతబస్తీలో వేశారు. ఇవ్వాళ మీటింగ్ అయింది. నేనో అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ని.''

''ఏడాదికి మూడు ఎలక్షన్లు మనకి. మన వోటే మనం వెయ్యలేక పోతున్నాం, అలాంటిది ఊళ్లో వాళ్ల చేత ఓట్లు వేయించటం తేలికైనపని కాదు. నాగరాజూ! నేను రాలేనుపొమ్మన్రా'' అన్నాను.

''కుదర్దు. నా పేరు మా ఆఫీసు వాళ్లే పంపించారు. మా ఆఫీసరుకి నా మీద కోపం, ప్రతీదానికీ రూల్సు చూపిస్తానని. అందుకే నా పేరు పంపాడు. తప్పలేదు'' అన్నాడు నాగరాజు.

''రూల్సు ఏవో మారాయనుకుంటాను ఈ మధ్య? అదీగాక మీకు రక్షణ గట్టిగా ఉంటుందనుకుంటా'' అడిగాను నేను.

దానికి వాడు ''అవును. ప్రతీ పోలింగ్ ఆఫీసర్‌కి రెండు లక్షలు భీమా చేస్తున్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌కి ఇద్దరు ఆయుధ ధారుల్ని కూడా నియమనించారు'' అన్నాడు.

''భీమా రెండు లక్షలంటే, పోలింగ్ ఆఫీసర్ల జీవితాలు రెండు లక్షలకి ఇన్సూర్ చేస్తున్నారన్నమాట. అంటే డ్యూటీకెళ్లేముందు విల్లు అదీ కూడా రాసి మరీ వెళ్లాలేమో?'' అన్నాను.

నాగరాజు కొడుకు శేఖర్ ఇదంతా విని ''నాన్నా మనకి రెండు లక్షలొస్తే నేను సైకిల్ కొనుక్కుంటా. కొనుక్కోనా?'' అన్నాడు.

''ఛీ! వెధవా! పాడుమాటలు నువ్వూను. నోర్మూసుకో'' అంది సావిత్రి. వాడికి సావ్రితి ఎందుకు తిట్టిందో అర్థం కాలేదు.

నేను సావిత్రికి ధైర్యం చెప్తూ ''ఫర్వాలేదులే ప్రతీ పోలింగ్ బూత్ మీద దాడులు జరగవ్. మావాడికేం భయం లేదు. వాడి నిజాయితీయే వాడికి రక్ష'' అన్నాను.

''అదేనండి నా భయం. ఈయనకి లౌకికం తెలీదు.'' అంది సావిత్రి.

మరుసటి వారం అదే రోజున పోలింగ్. ప్రతీపోలింగ్ స్టేషన్ దగ్గరా పాత తుపాకీలు పట్టుకొని నీర్సంగా ఉన్న పోలీసుల్ని కాపలా.గా పెట్టారు. పాతబస్తీలో నాగరాజు పనిచేయవలసిన బూత్‌లో కూడా ఇద్దరు అతి నీర్సస్తుల్ని ఎంపిక చేసి వేశారు.

నాగరాజు ఆ ముందు రోజు రాత్రే ఓట్ల డబ్బాలు-ఖాళీవి-పట్టుకొని పోలింగ్ స్టేషన్ చేరాడు. నాగరాజు డ్యూటీ మీద వెళ్తోంటే సావిత్రి హారతిచ్చి, అమ్మవారి పూజా కుంకుమ పెట్టింది. పూర్వకాలం రాజులు యుద్ధాలకెళ్లేటప్పుడు వీరపత్నులలా చేసేవారని ప్రతీతి.




అసలు పోలింగ్ ఆఫీసరు వినాయకరావు, చాలా పిరికివాడు. నాగరాజుతో ముందే చెప్పేశాడు- ''నాగరాజూ! కొంచెం పనులన్నీ నువ్వే చూసుకో. ఎవరితోటి వాదం పెట్టుకోకు. పోలీసు

లకి టీ, కాఫీలిచ్చి ఎక్కడికీ పోకుండా చూడాలి.''

ఆరోజు జరిగే ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు. కాని ఇద్దరి అభ్యర్థుల తాలూకు పోలింగ్ ఏజంట్లే ఉన్నారు. నాగరాజు అడిగాడు ''మూడో అభ్యర్థి తాలూకు ఏజంట్ రాలేదెందుకో?'' దానికి వినాయకరావ్ ''నీకెందుకు నాగరాజూ? నీ పని నువ్వు చూసుకో'' అన్నాడు. దున్నపోతు గుర్తున్నవాడి పోలింగ్ ఏజంట్ చూడగా సాక్షాత్తూ యమధర్మరాజుల వారి నౌకర్‌లాగా ఉన్నాడు. వాడు చిన్నగా నవ్వి, మీసం దువ్వుతూ నాగరాజు వంక చూసి ''నీకు కొత్తలా ఉంది ఈ పని. నేనీ సంవత్సరం మూడోసారి పోలింగ్ ఏజంట్ని. నీ పని నువ్వు చూసుకో'' అన్నాడు మేఘం ఉరిమినట్టు.

వినాయకరావు చూడనట్టు నటించాడు. నాగరాజు విని ఊరుకున్నాడు.

పోలింగ్ ప్రొద్దున్న 8 గంటల నుండి సాయంత్రం అయిదు గంటల దాకా. పది గంటలకి ఇద్దరే వ్యక్తులు ఓటు వేశారు. వాళ్లిద్దరూ కాక మూడోవాడు పదకొండు గంటలకి వచ్చాడు. వాడి పేరు ఓటర్ల లిస్టులో లేదు. వాడు ఓటు వెయ్యడానికి వీల్లేదన్నాడు రెండో పోలింగ్ ఏజంట్-వాడి అభ్యర్థి గుర్తు గంగిగోవు. వెంటనే 'వాడు ఓటు వెయ్యచ్చు'అన్నాడు యమధర్మరాజు బంటులాంటి వాడు. 'కాదు' అని రెండో వాడు అనగానే వాణ్ణి చిత్తుకింద కొట్టి బైటకు నెట్టేశాడు దున్నపోతు గుర్తువాడి బంటు. వినాయక్‌రావు నిద్రపోతున్నట్టు పడుకున్నాడు కుర్చీలోనే. నాగరాజు అడ్డుపడ్డే వాడిక్కూడా రెండు పడేశాడు ఆ దుండగుడు.




నాగరాజు వెళ్ళి విషయం పోలీసులకి చెప్పి పరిస్థితిని అదుపులో పెట్టమన్నాడు. దానికివాళ్లు తమ డ్యూటీ పోలింగ్ బూత్‌కి వెలుపలేగాని లోపల కాదన్నారు. గంగిగోవు గుర్తువాడి ఏజంట్ మాత్రం తిరిగి రాలేదు.

సుమారు పన్నెండు గంటలికి ఓ నలుగురు ఓటర్లు వచ్చారు. వాళ్లకి అందరికీ ఓట్లున్నాయి. కానీ దున్నపోతు గుర్తువాడి బంటు ''వాళ్లు ఓట్లు వెయ్యడానికి వీల్లేద''న్నాడు. వినాయకరావు నిద్ర లేవలేదు. నాగరాజు వాళ్లకి నలుగురికీ ఓట్లు ఇవ్వగానే బంటుగాడు అవి చింపేశాడు. వాళ్లు భయపడి వెళ్లిపోయారు. వాడికి నాగరాజు మీద విపరీతమైన కోపం వచ్చింది. ''ఉరేయ్ నీకింటికెళ్లాలనుందా?'' అన్నాడు.

దానికి నాగరాజు ''వెళ్లాలని ఉంది కాని, డ్యూటీ కదా! అయ్యాక వెళ్తాను'' అన్నాడు.

''నువ్వెలా వెళ్తావో చూస్తానేను'' అన్నవాడి మాటలకి వినాయకరావ్ వెంటనే లేచి వాడి కాళ్లు పట్టుకొని ''వాడ్ని వొదిలెయ్. పొట్టపట్టుకొచ్చాడు. వాడికి తెలీదు ఎలక్షన్ అంటే ఏమిటో'' అన్నాడు.

నాగరాజు మాత్రం మాట్లాడలేదు. వినాయకరావ్‌తో హీనస్వరంతో అన్నాడు. ''పొట్ట పట్టుకు రావడం ఏమిటి? పెట్టెపట్టుకొచ్చాను'' అన్నాడు. దానికి వినాయకరావ్ ''ఏడ్చావ్. వాడి సంగతి నీకు తెలీదు బ్రదర్. మనకి ఏకాలో తీసేస్తాడు వాడు'' అన్నాడు.

''పోలీసులున్నారుగా. ఎందుకు భయం?'' అడిగాడు నాగరాజు.

''పోలీసులా? మనల్ని వీడు పొడిచేశాక ఎన్నిపోట్లు పొడిచాడో, ఎక్కడ పొడిచాడో విచారించడానికి కొస్తారంతే''నిరాశగా అన్నాడు వినాయకరావ్.

వీళ్లిద్దరూ గుసగుసలుగా మాట్లాడుకుంటూండగా మరో నలుగురు దున్నపోతు గుర్తువాడి బంట్లు వచ్చారు. వాళ్లు సరాసరి వచ్చి ఓటర్ల జాబితా తీసుకొని, ఓట్ల కట్ట కోసం చేతులు చాచారు. వినాయకరావ్ మళ్ళీ పడుకున్నాడు. నాగరాజు ''మీరెవరు? మీ పేర్లేమిటి? మీకు ఓట్లున్నాయా?'' అని అడిగాడు.

దానికి వెంటనే పోలింగ్ ఏజంట్ లేచి ''నీకు భార్యా పిల్లలూ ఉన్నారా? నీకు వాళ్లని చూడాలని ఉందా?'' అని అడిగాడు కాలరు పట్టుకొంటూ.

''అదేం ప్రశ్నండీ? వీళ్లకి ఓటర్ల జాబితా, ఓట్ల కట్టలూ ఎందుకు? వీళ్లకవన్నీ ఇస్తే నా ఉద్యోగం ఊడుతుంది.'' అన్నాడు నాగరాజు.

''అవి ఇవ్వకపోతే నీరెండు కాళ్లూ ఊడతాయిప్పుడు'' అంటూ దవడ మీద చెంపకాయ కొట్టాడు ఆ నలుగురిలో వొకడు. దాంతో నాగరాజు వాడ్ని ఒక్కతోపు తోశాడు. నాగరాజు బలమైనవాడు కావడంతో వాడిపోతోపునకు ఆ దుండగుడు క్రింద పడ్డాడు. ఎవడు పేల్చాడో ఓ నాటు బాంబు పేల్చాడు. కొద్దిలో నాగరాజు తప్పించుకున్నాడు. ఆ విస్ఫోటానికి అక్కడి ఫర్నిచరూ కాగితాలూ చెల్లాచెదరైపోయాయి. వినాయకరావు బూత్ వెలుపలికి పారిపోయాడు. నాగరాజు మాత్రం బల్ల క్రింద కూర్చుండి పోయాడు.

పోలింగ్‌బూత్ పొగతోనిండిపోయింది. అలా ఎంత సేపు గడిచిందో తెలీలేదు నాగరాజుకి. వాడు లేచి చూసే సరికి అందరూ వెళ్లిపోయారు. ఓట్లన్నీ మాత్రం వాళ్లు డబ్బాలో పడేసి మరీపోయారు. వినాయకరావు, పోలీసుల్తో బూత్ బైటకూర్చొని టీ త్రాగుతున్నాడు.

దున్నపోతు గుర్తువాడి బంటుమాత్రం ఉన్నాడు. వాడు నవ్వుతూ అన్నాడు. ''ఓట్లన్నీ పోలైపోయాయి. ఇంకెవ్వడూ రాడిక్కడికి''

**(అల్లుడికే నైవేద్యం... వచ్చేవారం)**